క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

లేపాక్షి: 2023–2024 విద్యాసంవత్సరంలో ఒకటో తరగతిలో ప్రైవేటు పాఠశాలల్లో ప్రవేశం పొందడానికి అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈఓ నాగరాజు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఒకటో తరగతిలో చేరబోయే పేద విద్యార్థులకు మండలంలోని అన్ని ప్రైవేటు పాఠశాలలు 25 శాతం సీట్లు కేటాయించాలని విద్యా కమిషనర్ ఉత్తర్వులు జారీచేసిందన్నారు. అనాథ పిల్లలు, హెచ్ఐవీ బాధిత పిల్లలు, దివ్యాంగులకు 5 శాతం, ఎస్సీలకు 5 శాతం, ఎస్టీలకు 10 శాతం, బలహీన వర్గాల పిల్లలు (బీసీ, ఓసీ, మైనార్టీ)లకు 6 శాతం సీట్లు కేటాయించడం జరిగిందన్నారు. ఉచితంగ సీట్లు పొందాల్సిన పిల్లలు ఏ ప్రైవేటు పాఠశాల కావాలో http//cse.ap.gov.in వెబ్‌సైట్‌లో ఏప్రిల్ 4లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

నేడు వాహనాలు వేలం

లేపాక్షి: హిందూపురం రూరల్ సీఐ వేణుగోపాల్, స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ బ్యూరో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఉదయం 10 గంటలకు గతంలో పట్టుబడిన వివిధ వాహనాల వేలం నిర్వహిస్తామని ఎస్ఐ మునీర్‌అహమ్మద్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వేలంలో పాల్గొనదలిచిన వారు రూ. 5 వేలు ధరావత్తు చెల్లించాలన్నారు.

విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం


ఇంట్లో కాలిబూడిదైన వస్తువులు

గోరంట్ల: మేరెడ్డిపల్లిలో గురువారం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైంది. వివరాలు.. గ్రామానికి చెందిన నేసే రామకృష్ణప్ప ఉదయం వ్యవసాయ పనుల కోసం ఇంటికి తాళం వేసి వెళ్లారు. పది గంటల సమయంలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. గమనించిన కుటుంబ సభ్యులు మంటలు ఆర్పేందుకు యత్నించినా ఫలితం లేకపోయింది. ఘటనలో ఇంట్లోని టీవీ, ఫ్రిజ్, బీరువా, బియ్యం బస్తాలు, ఇతర వస్తువులు కాలిపోయాయి. దాదాపు రూ.2 లక్షలకు పైగా ఆస్తినష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు. తమను ఆదుకోవాలని బాధితుడు తహసీల్దార్ రంగనాయకులకు వినతి పత్రం అందజేశారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించండి

హిందూపురం టౌన్: పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని పెన్షనర్ల అసోసియేషన్ నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం స్థానిక ఇన్‌చార్జ్ తహసీల్దార్ సౌజన్యలక్ష్మికి వినతిపత్రం అందజేశారు.

వైభవంగా ముత్యాలపలకీ ఉత్సవం


ముత్యాల పల్లకీ ఉత్సవంలో ఊరేగుతున్న లక్ష్మీనరసింహస్వామి

చిలమత్తూరు: కనుమ భూనీల సమేత లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి స్వామి ముత్యాల పల్లకీ ఉత్సవం వైభవంగా నిర్వహించారు. ప్రత్యేక వాహనంలో శ్రీదేవీభూదేవి సమేత లక్ష్మీనారసింహ స్వామి ఉత్సవమూర్తులు భక్తులకు దర్శనమిచ్చారు. వే మన రెడ్డి సంఘం ఆధ్వర్యంలో ఆర్కెస్ట్రా ఏర్పా టు చేశారు...గురువారం ధ్వజావరోహణంతో పాటు ఉయ్యాలోత్సవం ఘనంగా నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో సరస్వతి పూజ

రొద్దం: స్థానిక కేజీబీవీలో పదోతరగతి విద్యార్థులు గురువారం సరస్వతి పూజ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం సరస్వతి చిత్ర పటానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాగరత్నమ్మ, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

పశువుల సంత వేలం

గుడిబండ: స్థానిక గ్రామ సచివాలయంలో సర్పంచ్ కరుణాకర్‌గౌడు, ఈఓఆర్‌డీ నాగరాజు నాయక్ ఆధ్వర్యంలో గురువారం పశువుల సంతకు బహిరంగ వేలం నిర్వహించారు. పశువుల సంత మార్కెట్‌ను రూ.86,30,000, దినసరి బస్టాండ్‌ను రూ. 2,03,000కు భోజరాజు దక్కించుకున్నారు. అలాగే కూరగాయల మార్కెట్‌ను రూ.3,44,000లకు లక్ష్మయ్య దక్కించుకున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మడకశిరరూరల్: గుడిబండ మండలం జమ్ములబండలో 132 కేవీ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి 11.30 గంటల వరకూ రొళ్ల, గుడిబండ, అగళి, అమరాపురం మండలాల్లో వ్యవసాయ రంగానికి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఏ సుబ్రహ్మణ్యం ప్రసాద్ తెలిపారు. అదే విధంగా 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అగళి, రొళ్ల, గుడిబండ మండలాల్లో పూర్తిగా విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించండి


పెనుకొండలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ


బాలికల జూనియర్ కళాశాలలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్


అమరాపురం: ఎమ్మెల్సీ ఎన్నికల కరపత్రాలు అందజేసిన ఎమ్మెల్యే తిప్పేస్వామి, పార్టీ పరిశీలకుడు అశోక్‌కుమార్

• ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ

పెనుకొండ: వైఎస్సార్‌సీపీ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థులు వెన్నపూస రవీంద్రారెడ్డి, ఎంవి. రామచంద్రారెడ్డిని గెలిపించాలని శ్రీసత్యసాయిజిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ ఓటర్లను కోరారు. శనివారం స్థానిక కోర్టు ఆవరణలో గురువారం న్యాయవాదులను కలసి ఎమ్మెల్యే ఓట్లు అభ్యర్థించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి న్యాయవాదుల సంక్షేమానికి కృషి చేస్తున్నారన్నారు. టీడీపీ చెప్పే మాయమాటలు నమ్మితే మోసపోక తప్పదన్నారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ బోయ నరసింహ, నగర పంచాయతీ చైర్మన్ ఉమర్‌ఫారూక్‌ఖాన్, వైస్ చైర్మన్ సునీల్, ఏజీపీ భాస్కరరెడ్డి, ఎంపీపీ గీత, కౌన్సిలర్లు రఘునాథరెడ్డి, తయూబ్, రామాంజినేయులు, భాస్కర్‌నాయక్, సద్దాం, శ్రీరాములు, కోఆప్షన్ మెంబర్లు నేమతుల్లా, ముహీబా మున్నీర్, నాయకులు మండల అగ్రి కమిటీ చైర్మన్ కొండలరాయుడు, ఫరీద్, జయశంకరరెడ్డి, బోయబాబు, శంకరరెడ్డి, నాయుడు, యాసిన్, గణేష్, శ్యాపురం లక్ష్మీనారాయణ, కిష్ట, మారుతి, సుశీలమ్మ తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా మునిమడుగు, అమ్మవారిపల్లి గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు గురువారం ముమ్మర ప్రచారం నిర్వహించారు. మాజీ సింగిల్ విండో అధ్యక్షులు సానిపల్లి శ్రీనివాసులు, నాయకులు పొగాకు రామచంద్ర, మండల మాజీ కన్వీనర్ సీరుగంటి వెంకటరాముడు, బయపురెడ్డి, దివాకర్‌రెడ్డి, పాదయాత్ర నటేష్, సుబ్బిరెడ్డి, వెంకటనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరిగి: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థులు న్న వెన్నపూస రవీంద్రరెడ్డి, రామచంద్రరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటును వేసి గెలిపించాలని శ్రీసత్యసాయి జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ విజ్ఞప్తి చేశారు. పరిగి, మోదా జెడ్పీ ఉన్నత పాఠశాలలు, సచివాలయాలు, కొడిగినహళ్లి ఏపీఆర్‌ఎస్‌లో ప్రచారం నిర్వహించారు. వెన్నపూస రవీంద్రరెడ్డి, రామచంద్రారెడ్డి బ్యాలెట్‌లలో 3, 11వ సీరియల్ నంబరులో మొదటి ప్రాధాన్యత ఓటును వేయాలని కోరారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహమూర్తి, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి డీవీ రమణ, జిల్లా కార్యదర్శి ప్రభాకర్, జెడ్పీటీసీ శ్రీరామప్ప, సింగిల్ విండో అధ్యక్షుడు మారుతీరెడ్డి, డైరెక్టర్ అశ్వర్థప్ప, కోఆప్షన్ మెంబర్ సలీం, సర్పంచ్‌లు మంజునాథరెడ్డి, దిలీప్, లక్ష్మణ్ణ, శివ, అంజి, శ్రీరామప్ప, నరసింహారెడ్డి, ఎంపీటీసీలు మారుతీరెడ్డి, చిక్కన్న, రామాంజి, అమరావతి, హనుమంతు, అంజి, మైనార్టీ నాయకులు రఫీక్, షబ్బీర్, ఆల్తాఫ్ పాల్గొన్నారు.

సోమందేపల్లి: పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థులు వెన్నపూస రవీంద్రారెడ్డి, రామచంద్రారెడ్డిని గెలపించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు కోరారు. గురువారం సాయంత్రం చాకర్లపల్లిలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నారాయణ రెడ్డి, మాజీ కన్వీనర్ వెకంటరత్నం, ఉప సర్పంచ్ వేణు, మైనార్టీ సెల్ కన్వీనర్ ఇమామ్‌వలి ప్రచారం నిర్వహించారు.

అమరాపురం: పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు వెన్నపూస రవీంద్రారెడ్డి, రామచంద్రారెడ్డి విజయానికి కృషి చేయాలని మడకశిర ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి, పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు పోకుల అశోక్‌కుమార్ కోరారు. గురువారం స్థానిక శ్రీసాయి విద్యానికేతన్ పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, శ్రీవాసవి విద్యామందిరంలో ప్రచారం చేశారు. ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటును తమ పార్టీ అభ్యర్థులు రామచంద్రారెడ్డి, వెన్నపూస రవీంద్రారెడ్డికి వేయాలన్నారు. పని చేసే ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి అండగా ఉండాలని కోరారు. అన్ని వర్గాల ప్రజల సమస్యలను పరిష్కరించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ఆలోచించి తమ పార్టీ అభ్యర్థులను బలపరచాలని కోరారు. అనంతరం కెంకెర గ్రామంలో పార్టీ సీనియర్ నాయకులతో సమావేశమయ్యారు. ప్రతి ఒక్కరూ గ్రామాల్లోని పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఇళ్ల వద్దకు వెళ్లి పార్టీ బలపరచిన అభ్యర్థులకు ఓటు వేయించాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో తిరుపతి పట్టణ యువత విభాగం అధ్యక్షుడు బండ్ల లక్ష్మీపతి, గోరంట్ల అశోక్, ఎంపీపీ ఈరన్న, జెడ్పీటీసీ సభ్యురాలు స్వారక్క, వైస్.ఎంపీపీలు క్రిష్ణమూర్తి, లలితమ్మ, ఆలయ కమిటీ చైర్మన్ మంజునాథ, వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు చిక్కన్న, కుంచిటి వక్కలిగ సంఘం డైరెక్టర్ రాజేశ్వరి, జేసీఎస్.మండల కన్వీనర్ శ్రీనివాసరెడ్డి, నారాయణ, ప్రసాద్ తిప్పయ్య, త్రిలోక్‌నాథ్, శివకుమార్ పిఆర్. మూర్తి పాల్గొన్నారు.

గుడిబండ: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వెన్నపూస రవీంద్రారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి, నియోజక పరిశీలకుడు అశోక్‌కుమార్ కోరారు. గురువారం మండలంలో ఎమ్మెల్సీ అభ్యర్థికి మద్దతుగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలు, సచివాలయాల్లో కరపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ రాధమ్మ, జెడ్పీటీసీ భూతరాజు, జేసీఎస్ కన్వీనర్ కె.శివకుమార్, సింగల్‌విండో అధ్యక్షుడు చంద్రశేఖర్, సర్పంచ్ యంజారేగౌడు, పాల్గొన్నారు.

జగనన్న నాయకత్వాన్ని బలపరచండి

హిందూపురం: ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థులకు ఓటు వేసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వాన్ని బలపరచాలని ఎమ్మెల్సీ మహమ్మద్‌ఇక్బాల్ అన్నారు. గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, వైస్‌చైర్మన్ జబీవుల్లా, రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ ఉపేంద్రరెడ్డి, జిల్లా యువజన విభాగ అధ్యక్షుడు లోకేష్ వాల్మీకి, పార్టీ నాయకులతో కలసి ఆయన ఎంజీఎం స్కూల్, జూనియర్ కళాశాల, ఓరియంటల్ స్కూల్, సచివాలయాల్లో విస్తృతంగా ప్రచారం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ బలపరచిన పట్టభద్రుల ఎమ్మెల్సీ వెన్నపూస రవీంద్రారెడ్డి, టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి రామచంద్రారెడ్డిని మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మల్లికార్జున, నాగేంద్రమ్మ, మల్లికా బేగం,రహమత్, లతీఫ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే వైఎస్సార్‌సీపీ నాయకులు చౌళూరు మధుమతిరెడ్డి పార్టీ నాయకులతో కలసి మండలంలోని ఎల్ఆర్‌జీ, ఐటీఐ, బసవనపల్లి హైస్కూల్‌లో ప్రచారం చేస్తూ చేపట్టారు. కోర్టు ఆవరణలో న్యాయవాదులు, కోర్టు ఉద్యోగులను ఏపీపీలు ఇందాద్, శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో నాయకులు కలసి ఓటు అభ్యర్థించారు. అలాగే 10వ వార్డు కౌన్సిలర్ పార్వతి, పార్టీ నాయకులు పోలీసుస్టేషన్, ఆర్టీఓ, రైల్వేస్టేషన్, రైల్వే పోలీసుస్టేషన్, బ్యాంకుల్లో ప్రచారం చేపట్టారు. అలాగే వివిధ వార్డుల్లో కౌన్సిలర్లు, పార్టీ నాయకులు ఓటర్ల ఇంటింటికీ వెళ్లి ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు.

మడకశిర(అగళి): పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం నుంచి వైఎస్సార్‌సీపీ తరఫున బరిలో నిలిచిన వెన్నపూస రవీంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వైఎస్సార్‌సీపీ తిరుపతి యువజన విభాగం అధ్యక్షుడు బండ్ల లక్ష్మీపతి, ఎమ్మెల్యే తిప్పేస్వామి, నియోజకవర్గ పరిశీలకుడు పోకుల అశోక్‌కుమార్, గోరంట్ల మండలం వైఎస్సార్‌సీపీ నాయకుడు సురేష్‌రెడ్డి తదిరతులు పేర్కొన్నారు. గురువారం అగళి మండలం మధూడి, కేజీబీవీ, మోడల్ పాఠశాలలో జోరుగా ప్రచారం నిర్వహించారు. రవీంద్రారెడ్డికి అత్యధికంగా ఓటు వేసి గెలిపించాలని కరపత్రాలను అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ చైర్మన్ నళిని, ఎంపీపీ రేణుక, నాయకులు మహేంద్ర, చంద్రప్ప, నగరాజు, జయరామప్ప, సచివాలయం కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.


ఎల్ఆర్‌జీ కళాశాలలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకురాలు చౌళూరు మధుమతిరెడ్డి

ఏడు పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు

హిందూపురం: కలెక్టర్ ఆదేశాలతో ఎమ్మెల్సీ ఎన్నికల ఓటింగ్ కోసం హిందూపురం నియోజకవర్గంలోని మున్సిపాలిటీ, మండలంలోని ఓటర్లకు స్థానిక ఎంజీఎం హైస్కూల్‌లో ఏడు పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ సౌజన్య తెలిపారు. ఇందులో పట్టభద్రులకు ఆరు పోలింగ్ కేంద్రాలు, టీచర్లకు ఒక పోలింగ్ బూత్ ఏర్పాటు చేశామన్నారు. అలాగే లేపాక్షిలోని ప్రభుత్వ జూనియర్ కాలేజ్, చిలమత్తూరులో పొట్టిశ్రీరాములు జెడ్పీ హైస్కూల్‌లో పోలింగ్ బూత్‌లు ఏర్పాట్లు చేశారు.

ఆర్‌బీకే సిబ్బందితో సమావేశం

లేపాక్షి: స్థానిక వ్యవసాయాధికారి కార్యాలయంలో ఆర్‌బీకే సిబ్బందితో హిందూపురం వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు జిఎం.అల్తాఫ్ అలీఖాన్ గురువారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సీహెచ్‌సీ గ్రూపు ద్వారా 50 శాతం నగదును పరికరాల కోసం ఏడీసీసీ బ్యాంకులో జమ చేసి ఈనెల 14లోపు గ్రౌండింగ్ చేయాలన్నారు. అంతేకాకుండా ఆర్‌బీకే సిబ్బందికి ఎరువుల కొనుగోలుపై డీబీటీ, నగదును వెంటనే మార్కెఫెడ్ ఖాతాలో జమచేయాలన్నారు. పీఎం కిసాన్, కేవైసీ పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఓ శ్రీలత, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

గుండెపోటుతో ఉపాధ్యాయుడి మృతి

మడకశిర: మండలంలోని వైబీహళ్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్ జీవీ చలపతి (60) బుధవారం అర్ధరాత్రి గుండెపోటుతో మడకశిర ప్రభుత్వ ఆస్పత్రిలో మృతి చెందాడు. మృతదేహాన్ని రొద్దం మండలం దందేపల్లి గ్రామానికి తరలించారు. మృతునికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. మృతుడి భార్య వైబీహళ్ళి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వర్తిస్తున్నారు.

పాఠశాలలో కుళాయిల ధ్వంసం

గుడిబండ: మండల పరిధిలోని ఎస్.రాయాపురం ఉన్నత పాఠశాల ఆవరణలో గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి మద్యం సేవించి, తాగునీటి కుళాయిలను విరగగొట్టారు. అలాగే పాఠశాల తలుపులు, కిటికీలను రాళ్లతో ధ్వంసం చేసినట్లు పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు మారుతి గురువారం తెలిపారు. హోలీ రోజున ఈ సంఘటన జరిగిందన్నారు.

వైభవంగా స్వారమ్మ దేవి జాతర


హారతులు తీసుకెళ్తున్న బాలికలు

పావగడ: తాలూకాలోని నిడుగల్ హోబళి కరెక్యాతనహళ్ళి, మద్దె గ్రామాల్లో స్వారమ్మ దేవి, శంకరలింగేశ్వర స్వామి జాతర వైభవంగా జరుగుతోంది. తెల్లవారుజామున 4 గంటల సమయంలో స్వారమ్మ దేవి, శంకరలింగేశ్వరస్వామికి అభిషేకం, కలశ పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం అగ్నిగుండం, బ్రేక్ల హారతుల పూజలు చేశారు. దేవి అనుగ్రహంతో కోరికలు తీరిన భక్తులు కట్టుకున్న కొబ్బరి ముడుపులను అగ్ని గుండంలోని సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు. మహిళలు గోధుమ పిండితో చేసిన ప్రమిదలతో జ్యోతులు వెలిగించారు.

పెద్దకాలువల్లో పూడికతీత పనులు

హిందూపురం: పెద్దకాలువల్లో పూడిక తొలగింపు చర్యలు చేపడుతున్నారు.రాబోవు వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని పట్టణంలోని సూరప్పకుంట, కొట్నూరు చెరువుల సప్లయ్‌చానల్, పెద్దకాలువల్లో పూడికతీత పనులు ముమ్మరంగా సాగుతున్నాయని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు తెలిపారు. సూరప్పకట్ట మరువ అనుబంధంగా నేతాజీ నగర్ వద్ద ఉన్న పెద్దకాలువలో జేసీబీ ద్వారా పూడికతీత పనులు చేపట్టామన్నారు. అలాగే మున్సిపల్ కార్యాలయం వెనుక వైపు వరకూ తొలగింపు పనులు చేపడుతున్నామని, తర్వాత కొట్నూరు సప్లయ్ చానల్ కాలువలో పూడికతీత కొనసాగుతాయన్నారు. అన్ని ప్రధాన కాలువల్లో ఏప్రిల్ ఆఖరుకు పూడిక తొలగింపు పూర్తి చేస్తామన్నారు.

బార్ అసోసియేషన్ మహిళా విభాగం ప్రారంభం


బార్ అసోసియేషన్ మహిళా విభాగాన్ని ప్రారంభిస్తున్న ఏడీజే శైలజ

హిందూపురం: హిందూపురం బార్ అసోసియేషన్ మహిళా విభాగాన్ని గురువారం అదనపు జిల్లా జడ్జి శైలజ ప్రారంభించారు. స్థానిక కోర్టు ఆవరణలో ఉన్న భవనాన్ని మహిళా న్యాయవాదుల కోసం ఏడీజే కేటాయించారు. ఈ నేపథ్యంలో భవనాన్ని ప్రత్యేకంగా రూపుదిద్దడంతో ఏడీజేతోపాటు న్యాయమూర్తులు శ్రీధర్, రాజ్యలక్ష్మి, ఆనంద తీర్థ, సుకుమార్ ప్రారంభించారు. అనంతరం ఏడీజే కోర్టు ఆవరణలో ఏడీజే కేక్ కట్ చేసి మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సమస్యల పరిష్కారానికి ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లాలని ఆమె మహిళా న్యాయవాదులు, ఉద్యోగులకు సూచించారు. అనంతరం మహిళా ఉద్యోగులను సన్మానించి బహుమతులు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగప్ప, ఏపీపీ ఇందాద్, ఏజీపీ శ్రీనివాసరెడ్డి, న్యాయవాదులు కళావతి, రత్నమ్మ, సంతోషి కుమారి, నవేరా, వందన, పవిత్ర, అంజనమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే ఎన్నికల ప్రచారం

రొద్దం: మండలంలో ఎమ్మెల్యే శంకరనారాయణ శుక్రవారం ఎమ్మెల్సీ అభ్యర్థుల తరఫున ఎన్నికల ప్రచారం చేయనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బోయ తిమ్మయ్య, సచివాలయాల సమన్వయకర్త ఆర్‌పి రవిశేఖర్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు రొద్దంలో ప్రచారం ప్రారంభిస్తారని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

జోరుగా ఎన్నికల ప్రచారం


రొద్దం: లోచెర్ల పాఠశాలలో ఓటు అభ్యర్థిస్తున్న నాయకులు

రొద్దం: వైఎస్సార్‌సీపీ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థులు వెన్నపూస రవీంద్రారెడ్డి, రామచంద్రారెడ్డిని గెలిపించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు ఓటర్లను కోరారు. గురువారం రొద్దం ప్రభుత్వ జూనియర్ కళాశాల, కోగిర, ఆర్ లోచెర్ల, కంచిసముద్రం, పాతర్లపల్లి, పెద్దకోడిపల్లి తదితర ప్రాథమిక పాఠశాలల్లో ప్రచారం నిర్వహించారు. ఎంపీపీ చంద్రశేఖర్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బి.నారాయణరెడ్డి, సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు మారుతీరెడ్డి, సర్పంచులు గంగాధర్, సోమిరెడ్డి, సచివాలయాల సమన్వయకర్త ఆర్‌పి రవిశేఖర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

మడకశిరరూరల్: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల స్థానం నుంచి వైఎస్సార్‌సీపీ తరఫున బరిలో నిలిచిన వెన్నపూస రవీంద్రారెడ్డికి తొలి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని వైఎస్సార్ సీపీ నాయకులు పట్టభద్రులకు విజ్ఞప్తి చేశారు. గురువారం హరేసముద్రం పంచాయతీలో సర్పంచ్ కరియన్న, వైఎస్ ఎంపీపీ మూర్తి, మండల ఎస్సీ సెల్ నాయకులు లక్ష్మీనారాయణ, సచివాలయ కన్వీనర్లు గ్రామ సచివాలయం ఉద్యోగులు, పట్టభద్రుల ఓటర్ల ఇంటి వద్దకు వెళ్లి, ఓట్లు అభ్యర్థించారు.

మడకశిర: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యార్థి పోటీలో ఉన్న వెన్నపూస రవీంద్రారెడ్డి మద్దతుగా గురువారం బెంగళూరులో వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం జిల్లా కార్యదర్శి మంజునాథ్ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో యువ నాయకులు చేతన్‌గౌడ, సుధాకర్, భోజేగౌడ, ఈరేష్, ధను, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే అభివృద్ధి


మహిళకు కుట్టు మిషన్ అందిస్తున్న ఎమ్మెల్యే వెంకటరమణప్ప

పావగడ: కాంగ్రెస్ హయాంలోనే రాష్ట్రంలో అభివృద్ధి పనులు జరిగాయని, తండ్రీ కొడుకులు (దేవేగౌడ, కుమారస్వామి) మాత్రం అబద్ధాలు చెప్పుకుంటూ తిరుగుతున్నారని ఎమ్మెల్యే వెంకటరమణప్ప విమర్శించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో గురువారం 50 మంది మహిళలకు కుట్టు మిషన్లు,75 మంది లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణ పత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం 40 శాతం కమీషన్లకు కక్కుర్తి పడుతోందన్నారు. చన్నగిరి ఎమ్మెల్యే విరుపాక్షప్ప ఇంటిలో రూ.8 కోట్ల అవినీతి సొమ్ము దొరికిందని, బీజేపీ పూర్తిగా అవినీతి మయమైందన్నారు. ఈసారి రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం దక్కించుకుంటుందన్నారు. తాలూకా వ్యాప్తంగా తుంభద్ర తాగు నీటి యోజన కింద ప్రతి గ్రామంలోనూ ఇంటింటికీ కుళాయిల ద్వారా తాగు నీరందించే పనులు త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. ఎగువ భద్ర జలాలతో తాలూకా లోని సుమారు 300 చెరువులకు నీరు నింపుతా మన్నారు. రాయదుర్గం–తుమకూరు రైలు ఇప్పటికే స్థానిక కే రాంపురం రైల్వే స్టేషన్‌కు వచ్చిందన్నారు. ఈ నెలాఖరులోగా పూర్తిస్థాయిలో రైలు సంచరించి పావగడ నుంచి నేరుగా తిరుపతికి వెళ్లవచ్చని తెలిపారు. డికే శివకుమార్ తో సోలార్ పార్క్, సిద్ధరామయ్య తో తుంగభద్ర తాగు నీటి పథకం సాధ్యమయ్యాయన్నారు. అంతకు ముందు రొప్పం, హులి బెట్ట తండా గ్రామాలలో రూ 2.25 కోట్ల నిధులతో జల జలజీవన్ మిషన్ పనులకు భూమిపూజ చేశారు. టీపీఎస్‌లో రూ.50 లక్షలతో నిర్మించిన నూతన మీటింగ్ హాల్‌ను ప్రారంభించారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

గోరంట్ల: కమ్మలవాండ్లపల్లి ఓ యువకుడు ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంచుకున్నాడు. గ్రామానికి చెందిన వడ్డే సురేష్ తల్లి, అవ్వతో కలిసి ఉంటున్నాడు. రాయి కొట్టే పనికి వెళ్లేవాడు. గురువారం ఉదయం యథావిధిగా పనికి వెళ్లాడు. మధ్యాహ్నం సమయంలో ఇంటికి వచ్చాడు. ఎవరూ లేని సమయంలో ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. స్థానికులు గమించి వెంటనే గోరంట్ల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యుల సూచనల మేరకు 108లో హిందూపురం ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు.

రాగి జావ తయారీపై అవగాహన


వలస డిపెప్ పాఠశాలలో వర్క్ పుస్తకాలను పరిశీలిస్తున్న ఎంఈఓ సత్యనారాయణ

అమరాపురం: రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 21వ తేదీ నుంచి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు రాగి జావ అందజేయనుందని ఎంఈఓ సత్యనారాయణ తెలిపారు. గురువారం మండలంలోని విరుపసముద్రం , వీరాపురం, వలస డిపెప్ పాఠశాలలను సందర్శించారు. విద్యార్థులు ఉపాధ్యాయుల హాజరు పట్టికను పరిశీలించారు. డిపెప్ పాఠశాలలో చిత్రాన్నం రుచిగా లేకపోవడంతో నిర్వాహకులను మందలించారు. విరుపసముద్రం పాఠశాలలో రాగి జావ తయారీపై అవగాహన కల్పించారు. ఇప్పటికే ముడి సరుకులు అందాయని, మండంలోని ప్రతి పాఠశాలలో ప్రభుత్వం ఆదేశాల మేరకు రాగి జావాను విద్యార్థులకు అందించాలని వంట ఏజేన్సీలకు సూచించారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి


ప్రతిభా పురస్కారం అందిస్తున్న సబ్ కలెక్టర్ కార్తీక్

పెనుకొండ: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని సబ్ కలెక్టర్ కార్తీక్ పేర్కొన్నారు. పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో గురువారం లింగ సమానత్వం కోసం ఆవిష్కరణ సాంకేతికత అనే అంశంపై కార్యక్రమాన్ని నిర్వహించారు. సబ్ కలెక్టర్ మాట్లాడుతూ మహిళా సాధికారత సాధించాలంటే లింగానిర్ధారణ పరీక్షలు చేయకూడదన్నారు. బాల్య వివాహాలను అడ్డుకోవాలన్నారు. ఐసీడీఎస్ పీడీ లక్ష్మీకుమారి మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు అంకితభావంతో పని చేయాలన్నారు. సమావేశంలో సీడీపీఓ శాంతలక్ష్మి, ఏజీపీ భాస్కరరెడ్డి, రిటైర్డ్ జేసీ విశ్వనాథ్ మహిళా దినోత్సవ ప్రాధాన్యతను వివరించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సిబ్బందికి సబ్‌కలెక్టర్ ప్రతిభా పురస్కారాలను అందజేశారు. సూపర్‌వైజర్‌లు సుజాత, అనూరాధ, నాగరాణి, జరీన్‌తాజ్ తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని బీజేసీ నాయకులు తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ స్వర్ణలత, డీటీ ప్రభావతి తదితరులను సన్మానించారు.

సోమందేపల్లి: మండల కేంద్రంలో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో మహిళలు ర్యాలీ చేపట్టారు. అనంతరం వైకేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్ఐ విజయ్‌కుమార్ మాట్లాడుతూ మహిళలు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ఎంపీడీఓ వెంకటేశ్వర రావు, ఏపీఎం రామాంజినేయులు, మండల సమాఖ్య అధ్యక్షురాలు షాహిన, యానిమేటర్లు, సీసీలు పాల్గొన్నారు.

అడవికి నిప్పు

మడకశిర రూరల్: మండల పరిధిలోని గుర్రపుకొండ సమీపంలోని అటవీ ప్రాంతానికి గురువారం ఆకతాయిలు నిప్పంటించారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది, అటవీ శాఖ అధికారులు వెంటనే అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేశారు.

కోళ్ల షెడ్డులో అగ్ని ప్రమాదం

పావగడ: తాలూకాలోని వైఎస్ హొసకోట హోబళి తిప్పగానహళ్ళి గ్రామానికి చెందిన రైతు హనుమంతరాయప్పకు చెందిన కోళ్ల షెడ్డులో గురువారం మధ్యాహ్నం అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. వివరాలు.. బాధితుడు హనుమంతరాయప్పకు మూడు కోళ్ల షెడ్లు ఉండగా.. పెంపకానికి కోడి పిల్లలను తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నాడు. ఈ నేపథ్యంలో కోళ్ల షెడ్లకు అవసరమైన రూ.5 లక్షల విలువైన పరికరాలను షెడ్డులో భద్రపరిచాడు. గురువారం మధ్యాహ్నం అగ్ని ప్రమాదం సంభవించింది. స్థానికులు మంటలను ఆర్పేందుకు ప్రయత్నం చేసినా.. షెడ్డు పూర్తిగా కాలి బూడిదైంది.